# చరిత్ర

అవి వెన్నెల రోజులు కావు.

ఆకాశంలోని చుక్కలకు మిణుకులే కాని వెలుగులు లేవు.

ఆ వీధిలో జన సంచారం అంతగా లేదు.

ఎక్కడో సన్నగా వినిపిస్తున్న రేడియో, ఆకాశవాణి వివిధభారతి తెలుగు కార్యక్రమాన్ని కుదించి కుదించి ఎనిమిదిన్నరకే ముగించింది.

ఆ వీధి మూలలో ఓ కుక్క తన ఉనికిని బిగ్గరగా చాటుతోంది.

తేజ చేయి పట్టుకొని సౌమ్య గబ గబా అడుగులు వేస్తోంది. అవి తడబడు అడుగులే కాని తప్పటడుగులు కావని ఆ జంట విశ్వాసం.

ఆటోలో స్టేషన్ చేరుకొని, రాత్రి బండికే పట్నం పారిపోయి గుళ్ళో పెళ్ళి చేసుకోవాలని వారి ఆలోచన.

ఆటోరిక్షా చప్పుడు లేదు.

రిక్షాల అలికిడి లేదు.

చైతన్యాన్ని కోల్పోయి శాపగ్రస్తమైనట్లు ఉంది ఆ ప్రాంతం.

గదుల్లో బందీలైన దీపాలు తలపు సందుల్లోంచి తొంగి చూస్తున్నాయి.

"ఏం చేద్దాం తేజా?" కంగారుగా అడిగింది సౌమ్య.

వెనక్కు తిరిగి పోలేరు. ముందుకు వెళ్ళే దారి లేదు. ఇంకాస్సేపట్లో తమను

వెదుక్కుంటూ ఎవరైనా రావచ్చు. వారి కంటపడితే ఇక జీవితాంతం కంట తడే అని విచారిస్తున్నది సౌమ్య.

ఆ వీధి దాటారు. మరో రెండు వీధులు దాటితే స్టేషన్‌కు వెళ్ళే రోడ్డు.

అంతటా నిశ్శబ్దం. అంతకంతకూ దగ్గరవుతున్న ఆపద.

మరో వీధి మూల దాటుతుండా ఎదురుగా వస్తున్న నలుగురు పోలీసులు యూనిఫారం మార్చుకున్న యమభటుల్లా కనిపించారు.

"కర్ఫ్యూ హై – భాగో!" అన్న హెచ్చరిక వినిపించింది.

సౌమ్య చేయి పట్టుకొని పక్క వీధిలోకి పరుగెత్తాడు తేజ. దగ్గరలోని ఒక ఇంటి తలుపు తట్టాడు. లోపల్నించి "కో నై?" అని ఒక గొంతు ఉర్దూలో అడిగింది.

'జరా దర్వాజా ఖోలో' అని అదుర్దాగా అడిగాడు తేజ.

సౌమ్య భయంతో వణికిపోతూ అతని చేయి గట్టిగా పట్టుకుంది.

పోలీసుల ఆరాలకు దొరికితే ఆపదల గుప్పిట్లో చిక్కినట్లే.

తలుపులు కొంచెం ఓరగా తెరిచి ఓ వృద్ధురాలు బయటికి తొంగి చూసింది.

"దయ చేసి లోపలికి రానివ్వండి" అని ఉర్దూలో అడిగాడు తేజ.

ఆమె తేజను, అతన్ని ఆనుకొని లేడిలా బెదిరిపోతున్న సౌమ్యను చూసింది. తల పంకించి ఆదరంగా "ఆవో బేటా" అని లోనికి ఆహ్వానించింది.

తేజ, సౌమ్య ఆ ఇంట్లో అడుగు పెట్టగానే ఆ వృద్ధురాలు బయటి తలుపులు మూసేసింది.

ఆ రోజు శుక్రవారం. అప్పుడు సమయం తొమ్మిది దాటింది. ఆ ఇంట్లోని కుటుంబ సభ్యులంతా టీ.వీ. రామాయణం చూస్తున్నారు. తేజ,సౌమ్యలకు తమ పక్కన చోటిచ్చారు.

ఇంకా అదురు తగ్గని సౌమ్య తల నిమురుతూ "భయపడకు బిడ్డా – అల్లా మీకు మేలుచేస్తాడు" అంది ఉర్దూలో ఆ వృద్ధురాలు.

❊❊❊

"కమ్లక్కా! కమ్లక్కా!" అన్న పిలుపు విని కమలమ్మ తలుపు తీసింది.

ఎదురుగా పక్కింటి అహ్మద్ బీబీ కనిపించింది.

"రా బీబీ!" అని లోనికి పిలిచింది కమలమ్మ.

"రాములన్న లేడా?" అని అడిగింది బీబీ.

"వూరికి పోయిండు గదా..."

"మీ అన్న పన్కి బోయి ఇంక రాలేదు కమ్లక్కా కర్ఫీ పెట్టిండ్లంట..."

"అవ్... మరీ కరీమన్న ఎట్లొస్తడు?"

"గదే నేను పరేషాన్ అయితాంటె గీ పోరలు చెయిన్ పడనిస్తలేరు. సంటిదానికి పాలిచ్చి పడ్కోబెట్టిన. పెద్ద పోరలు ఆకలి ఆకలి అని సతాయిస్తాండ్లు."

"అయ్యో మా ఇంట్ల అన్నం వుండె గదా, కొంటబోయి పెట్టకపోయినవు బీబీ."

"మీ అన్న ఎట్లొస్తడో, ఎప్పుడొస్తడో వచ్చినా గని దుకునంలకు బోయి సోదలు తెచ్చేటట్లు లేదాయె".

"ఔ... కర్ఫీల దుకునంలన్నీ బందాయె..."

"గిట్ల కర్ఫీలు పెట్టి మనల్ని సంపుతరేంది కమ్లక్కా? ఒగ వానొచ్చినా వర్దొచ్చినా మనకే తక్లీపాయె. కర్ఫీలల్ల రోజు కూలీలు ఎట్ల బత్కుతరు అని సోంచాయించెటోళ్ళు లేకపోయిరి."

"మన బతుకులను పట్టించుకునేటోళ్ళు ఎవలు బీబీ? గట్ల పట్టించుకునేటోళ్ళుంటే మనం గిట్లెందుకుంటం?"

"గిప్పుదు గీ కర్ఫీ ఎందుకు పెట్టిండ్లట కమ్లక్కా?"

"గదే గా జాగ మీన లొల్లి అయితాంది గదా?"

"గందుకేనా? నేను గందుకే అనుకుంటాన్న"

"ఆఁ... ఆళ్ళు ఆళ్ళు కొట్లాడుకోని ఏమో మన పానాల మీనికి తేబట్టిరి."

"ఆ జాగల ఏం వుంటె ఏందట. ఏం లేకపోతే ఏందట కమ్లక్కా?"

"ఔ గదా. ఏమో గట్ల కొట్లాడుకోబట్టిరీ! గీ పెద్దోళ్ళకు పెద్ద బుద్ధులుండయి గదా"

"కల్లు సార తాగినోళ్ళన్నా ఒగ మాట గాకపోతే ఒక మాటన్న సమజ్ చేసుకుంటరు."

"గీ వీళ్ళు గతకంటె అన్నాలం అయిండ్లు గదా."

"ఔ మల్ల."

"ముందుగాల సంటోళ్ళకు బువ్వ తినిపంచు బీబీ" అని కంచంలో అన్నం, కూరవేసి ఇచ్చింది కమలమ్మ.

"నీ కడుపు సల్లంగ వుండు కమ్లక్కా. నువ్వు రాములన్న మమ్ముల ఒక తోడబుట్టి నోళ్ళెక్క సూసుకుంటాండ్లు."

"గరీబోళ్ళం మనం ఒగరి కోరం ఆదుకోకపోతే మంది ఆదుకుంటారు బీబీ. సంటోళ్ళు ఎంత ఇద్దైపోతాండ్లో జెప్పున తినబెట్టిరా" అని చెప్పింది కమలమ్మ.

❊ ❊ ❊

"చూడండి ఈ తగువు ఇంతటితో ఆపేయండి. కర్ఫ్యూ తొలగి ఇప్పుడిప్పుడే జనం కొంత ఊరట పొందుతున్నారు. మళ్ళీ ఆ స్థలం విషయం తీసి గొడవలు లేపకండి" అన్నాడు శంకరయ్య.

అరవై ఏళ్ళ శంకరయ్యకు ఆ ప్రాంతంలో పలుకుబడి ఉంది. నిజమైన ప్రజాసేవకుడనే గౌరవం ఉంది. ఎందుకంటే ఆయన ఎప్పుడూ రాజకీయాల జోలికి పోలేదు.

"హిందువులకు జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ ఊరుకొమ్మంటావా?" ఆగ్రహంగా అన్నాడు వీరేశం.

"ముసల్మానులకు డోకా జరిగిందో ఒక్కొక్కణ్ణి పిండి పిండి చేస్తా!" అన్నాడు ఖాన్-

"ఆగండి. కాస్త శాంతించి నా మాట వినండి. పెద్దలు మీరే ఇట్లా ఉద్రేకపడితే ఇక యువతరం మాటేవిటి? కులాల పేరుతో, మతాల పేరుతో పోట్లాటలకు దిగేవాళ్ళు జాతికి, దేశానికి తీరని ద్రోహం చేస్తున్నారు. ఎవడు హిందువు? ఎవడు ముస్లిం? అసలు ఆదిమానవుడిది ఏం కులం? ఏం మతం? మనమంతా మానవులం భాయ్. ఈ మతాలు, కులాలు మనం పెట్టుకున్న అడ్డుగోడలు. ఈ గోడల్ని కూల్చి చేయిచేయి కలిపి మనమంతా దేశాభివృద్ధికి పాటుపడవలసిన సమయం ఇది. స్వాతంత్ర్యోదమ కాలంనాటి స్ఫూర్తి, దీక్ష మరోసారి మనలో పెల్లుబికి రావాలి" అని హితబోధ చేశాడు శంకరయ్య.

"మీరు ఎన్నైనా చెప్పండి శంకరయ్యా కాకా! ఈ జాగ మాది - ఇక్కడ ఒకప్పుడు మసీదు ఉండేది. కాబట్టి మళ్ళీ మసీదు కడతాం" గర్జించాడు ఖాన్.

"కాదు - కాదు - కాదు - ఇక్కడ దేవాలయం ఉండేది. మళ్ళీ దేవాలయమే నిర్మిస్తాం" వీరావేశంతో అన్నాడు వీరేశం.

"ఆగండి. దయచేసి నా మాట వినండి. మీరూ మీరూ పోట్లాడుకుని మళ్ళీ మత కలహాలు తెచ్చి అమాయకుల్ని పొట్టన పెట్టుకోవద్దు. తోటి మానవుల ప్రాణం కంటే విలువైనదా మతం?"అని ప్రశ్నించాడు శంకరయ్య.

అలాంటి ప్రశ్నలనే గాలి తెరలు మేఘాల్ని వర్షింపజేయగలవు కాని, బండరాళ్ళను అరగదీయటానికి ఎంత కాలం పడుతుందో!

వర్గాల తగాదాల్లో చిక్కుకున్న ఆ స్థలం వంక చూశాడు శంకరయ్య.

అక్కడక్కడా పొదలు, ఏపుగా పెరిగిన గడ్డి, మసీదు ఛాయలు కాని, దేవాలయ శిథిలాలు కాని మచ్చుకైనా కానరాని ఆ ప్రదేశం ఆకుపచ్చని తివాచీలా ఉంది.

"పోనీ... ఇక్కడ మసీదు, దేవాలయం రెండూ కట్టుకోండి" అన్నాడు శంకరయ్య.

"వీల్లేదు" అన్నాడు ఖాన్.

"వీల్లేదు" అన్నాడు వీరేశం.

"ఈ స్థలం మాది, మసీదు మాత్రమే కట్టాలి."

"దేవాలయమే నిర్మించాలి."

"ఏదీ ఒద్దు. చక్కని పూలతోట పెంచుదాం" అన్నాడు శంకరయ్య.

ఆ అందమైన ఆలోచన ఖాన్‌కు నచ్చుతుందా? వీరేశానికి నచ్చుతుందా?

అప్పటికే నలుగురు అక్కడ పోగయ్యారు. ఇంకాస్సేపట్లో వారే రెండు వర్గాలు అవుతారు.

"ఇక్కడ ఒక అనాథ శరణాలయం నిర్మిద్దాం. అందుకు కావలసిన చందాలు నేను పోగు చేస్తా."

ఆ సలహా కూడా వారికి నచ్చలేదు.

"చూడండి ఈ స్థలంలో ప్రస్తుతం మసీదుకు సంబంధించిన ఆనవాళ్ళు కాని, దేవాలయం శిథిలాలు కాని లేవు. అందుచేత ఇది అందరి భూమి ఇక్కడ ఒక విద్యాలయాన్ని నిర్మించి మన పిల్లల బంగారు భవిష్యత్తుకు వినియోగిద్దాం."

శంకరయ్య సూచన అక్కడ గుమిగూడిన కొన్ని తలలకు నచ్చింది. అది గుండెల్లోంచి వచ్చిన స్పందన. కాని మరుక్షణంలో ఖాన్, వీరేశాల చూపులు పడి ఆ స్పందనలు ఆగిపోయాయి. తలలు నిటారుగా, కరుకుగా రాళ్ళలా నిల్చున్నాయి.

"ఆ గడ్డిని పీకేసి నేలను తవ్వి చూడండి. దేవాలయ శిథిలాలు బయటపడతాయి" అన్నాడు వీరేశం.

"ఆ...తవ్వి చూడండి. మసీదు గోపురాలు తగుల్తాయి." అన్నాడు ఖాన్.

"నువ్వు చూశావా ఇక్కడ మసీదు ఉండగా?" సవాలు విసిరాడు వీరేశం.

"నువ్వు చూశావా ఇక్కడ గుడిని?" ప్రతి సవాలు విసిరాడు ఖాన్.

"మా తాత ముత్తాల కాలంలో ఉండేదట."

"మా తాత ముత్తాతల జమానాలో ఇక్కడ మసీదు ఉండేదట."

"మసీదు లేదు. గుడే ఉండేది."

"కాదు మసీదే ఉండేది."

"అయ్యా... మీరిట్లా వాగ్వివాదం పెట్టుకుంటే సమస్య పరిష్కారమవుతుందా?" ఆ రెండు తలల్నీ శాంతింపజేయడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నాడు శంకరయ్య.

"చివరిసారిగా నే నొక సలహా చెబుతాను వింటారా?" అని అడిగాడు.

ఏవిటన్నట్లు విసుగ్గా చూశాడు వీరేశం. కోపంగా చూశాడు ఖాన్.

"ఇక్కడ తవ్వితే మసీదుశిథిలాలు కనిపిస్తాయని ఖాన్, కాదు దేవాలయం శిథిలాలు కనిపిస్తాయని వీరేశం అంటున్నారు. కాబట్టి తవ్వి చూద్దాం. ఏ శిథిలాలు దొరికితే అదే నిర్మించుకోండి."

స్పందనల మీద ఈసారి ఖాన్, వీరేశాల చూపుల ముసుగులు పనిచేయలేదు.

"అలాగే తవ్వి చూద్దాం."

"తవ్వి చూద్దాం" అన్నారు అక్కడ పోగైన జనం.

తల వంచక తప్పలేదు ఖాన్, వీరేశం.

ఆ విధంగా ఇరు వర్గాల అంగీకారంతో వివాదాస్పదమైన ఆ ప్రదేశంలో తవ్వకం ప్రారంభమైంది.

ఒకరోజు కాదు,రెండు రోజులు కాదు, వారం రోజుల దాకా సాగింది తవ్వకం.

చివరికి –

ఆ ప్రదేశంలో –

మసీదు చిహ్నాలూ దొరకలేదు.

దేవాలయం శిథిలాలూ కనిపించలేదు.

తవ్వగా... తవ్వగా... మనుషుల అస్థిపంజరాలు కనిపించాయి!

*ఆంధ్రప్రభ వారపత్రిక, 21-6-1989*